క్లుప్తంగా

పూరీ యాత్రికులకు కోటలో స్వాగతం



పూరీ వెళుతున్న మహారాష్ట్ర భక్తులకు సామర్లకోటలో స్వాగతం

సామర్లకోట: మహారాష్ట్ర నుంచి పాద యాత్రగా పూరీ క్షేత్రంలోని జగన్నాథుని దర్శించుకోవడానికి బయలు దేరిన భక్తులకు ఆదివారం సామర్లకోటలో అపూర్వ స్వాగతం లభించింది. పవిత్ర పూరీ పుణ్యక్షేత్రంలోని జగన్నథ స్వామిని దర్శించుకోవడానికి దేశ నలుమూలల నుంచి అనేక మంది భక్తులు తరలి వెళతారు. వారిని దర్శించుకోవడం ద్వారా మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ఈ మేరకు సామర్లకోట యూత్ సభ్యులు స్వాగతం పలికి వారికి భోజన, వసతి సౌకర్యాలు కల్పించారు. యూత్ సభ్యులు ఇచ్చిన అతిధ్యానికి మహారాష్ట్ర భక్తులు ఫిదా అయ్యారు.

మరిడమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



అమ్మవారి ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో వారం వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఈ ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



వేసవి శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న నాగరాజు

పెద్దాపురం: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని, శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం పుస్తక పఠనం, కథలు చదవడం నేర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ విటమిన్ల ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లియ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొత్తపల్లి: యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై జి.వెంకటేష్ అన్నారు. ఉప్పాడ- కాకినాడ బీచ్ రోడ్డులో ఆదివారం యువతకు మత్తు పదార్థాల వల్ల నష్టాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు అలవాటైతే ప్రమాదాల్లో పడతారని, మద్యంకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. తీరప్రాంతాల్లో సేదతీరే పర్యాటకులు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. పోలీసుల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన తీర ప్రాంతాల్లో స్నానాలను చేయరాదని సూచించారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు



పిఠాపురం: గొల్లప్రోలు మండలం, దుర్గాడ రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం భాను సప్తమి, పుష్యమి నక్షత్రం, పుష్యార్క యోగం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండిత బృందం, సేవాసమితి ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు నిర్వహించారు. శరీర ఆరోగ్యం కోసం సూర్య భగవానునికి ప్రీతికరమైన త్రిచ, ఆరుణం, సౌర మంత్రాలతో పారాయణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

కళ్లాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం

- అకాల వర్షంతో అన్నదాతకు అపార నష్టం
- తడిసి ముద్దయిన ధాన్యం
- ధాన్యం కొనుగోలులో జాప్యం



సామర్లకోట సంపెంగ తోటలో రోడ్డుపై వర్షపు నీరు



వీకే రాయపురంలో పొలంలో నీరు చేరడంతో తడిసిన ధాన్యం రాశులు

సామర్లకోట: అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిచిముద్దయ్యాయి. కళ్ల ముందే కష్టం నీటిపాలవుతుంటే ఏం చేయాలేని స్థితిలో రైతులు ఉండిపోయారు. అనుకోకుండా ఆదివారం ఉదయం సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దాంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్టేషన్ సెంటర్, సంపెగతోట, కాకినాడ రోడ్డులో రైల్వే గూడ్స్ యార్డు, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్ నీటిలో మునిగిపోయాయి. ఇప్పటికే వరి కోతలు పూర్తి చేసుకోవడంతో రైతులు ధాన్యం విక్రయం కోసం ధాన్యాన్ని తమ తమ పొలాల్లో రాశులుగా వేసి బరకాలు కప్పుకున్నారు. అయితే ఆదివారం కుండ పోతగా కురిసిన వర్షంతో ధాన్యం రాశులు పూర్తిగా తడిముద్దయ్యాయి. సామర్లకోట-పిఠాపురం రోడ్డులో రోడ్డు మార్జిన్‌లోను, మాండవ్యనారాయణస్వామి ఆలయం, పంచారామక్షేత్రం, మదుగులమ్మ ఆలయం, సుగర్ ఫ్యాక్టరీ యార్డులతో పాటు అనేక మంది రైతులు ధాన్యం రాశులను సామర్లకోట మున్సిపాలిటీతో పాటు అనేక గ్రామాల్లో పొలాల్లోనే రాశులుగా ఉంచారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటుందని అధికారులు హామీ ఇవ్వడంతోనే తమ పొలాల్లో ధాన్యం రాశులను ఉంచామని రైతులు చెబుతున్నారు. అయితే పొలాల్లో ఉన్న రాశుల వద్ద నీరు చేయడంతో ధాన్యం పూర్తిగా తడిచి ముద్దయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతలు జరిగిన వెంటనే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసుంటే ఇంత నష్టం ఉండేది కాదని రైతులు నేతల హరిబాబు, వెలమర్తి బుల్లిరాజు, శ్రీనివాసు, తలారి దొరబాబు, ఇంటి రమేష్, మోరంపూడి రమేష్ ఆరోపిస్తున్నారు. ధాన్యం మిల్లులకు కేవలం 1000 క్వింటాళ్ల టార్గెట్ పెట్టడంతో వెంటనే టార్గెట్ పూర్తి కావడంతో ధాన్యం అమ్మకానికి అవకాశం ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎంఆర్‌లో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వలన కళ్ల ముందే ధాన్యం తడిసిపోయాయని, తడిచి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని నేతల హరిబాబు డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ధాన్యం తడి పొయిందని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రూ.200లకు తక్కువకే ధాన్యం అమ్మకం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని హరిబాబు ఆరోపించారు.



సామర్లకోట-కాకినాడ రోడ్డులో రైల్వే గూడ్స్ యార్డు వద్ద చెరువుగా తలపిస్తున్న వర్షపు నీరు



వీకే రాయపురంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో కొండెవరం వద్ద జలమయమైన రహదారి



వాకతిప్పలో ధాన్యం రాసులపై బరకాలు కప్పిన రైతులు

భారీ వర్షం రోడ్లు జలమయం

కొత్తపల్లి: మండలంలోని భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కురిసిన భారీ వర్షానికి జన జీవనం స్తంభించింది. ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది.

అకాల వర్షంతో వరి రైతులు హడలెత్తిపోతున్నారు. చేతికి వచ్చిన పంటను కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అరబెట్టిన ధాన్యాన్ని రాశిలు చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ధాన్యం రాశిలను బరకాలతో కప్పి కాపాడుకుంటున్నారు.

నిండా ముంచేసింది...!

- అకాల వర్షంతో అన్నదాత విలవిల
- నీట మునిగిన పిఠాపురం పట్టణం, లోతట్టు గ్రామాలు



నీట మునిగిన పిఠాపురం మెయిన్ రోడ్డు

పిఠాపురం: గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాత విలవిల్లాడుతున్నాడు. కోత కోసి అమ్మకానికి సిద్ధం చేసిన వరి పంట తడిసిపోతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం తడిసి పోకుండా కాపాడుకోడానికి వ్యవప్రయాసలకు గురవుతున్నారు. మరో పక్క పిఠాపురం పట్టణం నీటమయమై స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఏవీధి చూసినా డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లు మురికి కూపాలుగా మారిపోయాయి. నియోజకవర్గం లోని వివిధ గ్రామాల్లో రోడ్లు జలమయంగా మారాయి.



పిఠాపురంలో నీట మునిగిన విద్యుత్ నగర్ మెయిన్ రోడ్డు



ధాన్యం తడిసిపోకుండా బరకాలు కప్పిన రైతులు



పిఠాపురం పట్టణంలో వాహనదారుల ఇక్కట్లు

ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గంలో పెద్దాపురానికి ప్రాధాన్యం



జిల్లా నూతన కార్యవర్గంలో పెద్దాపురం సభ్యులు

పెద్దాపురం: ఏపీయూడబ్ల్యూజే కాకినాడ జిల్లా తొలి నూతన కార్యవర్గంలో పెద్దాపురం నియోజకవర్గానికి ప్రాధాన్యం లభించింది. జేఎన్‌టీయూ అల్యూమినియం ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన జిల్లా తొలి నూతన కార్యవర్గంలో పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన ఐదుగురికి స్థానం లభించింది. సీనియర్ జర్నలిస్టు దుర్రాని, యూనియన్ మాజీ అధ్యక్షుడు స్వాతి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో భాగంగా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యుడితో పాటు ఎలక్ట్రానిక్ మీడియా విభాగంలో జిల్లా ఉపాధ్యక్షుడు, కార్యవర్గ సభ్యుడు స్థానాలను పెద్దాపురం, సామర్లకోట సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెద్దాపురానికి చెందిన రాకుర్తి రాంబాబు(సాక్షి), కోశాధికారిగా చవ్వాకుల ఈశ్వరరావు (ఆంధ్రప్రభ), జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సామర్లకోటకు చెందిన ఎలిశెట్టి సత్యనారాయణ (విశాలాంధ్ర), ఎలక్ట్రానిక్ మీడియా విభాగం నుంచి సామర్లకోటకు చెందిన ఉప్పలపాటి చంద్రదాస్ (ఏపీటీఎస్ న్యూస్), జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గోవిందలపూడి సుబ్రహ్మణ్యం(ఆర్‌టీవీ)లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజవర్గంలో సీనియర్ జర్నలిస్టు అడపా వెంకట్రావు (సాక్షి)ని అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.

కాండ్రకోట నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చు ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి ఐదో ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమవాస్య మాసం పురష్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ ఆర్.సౌజన్య, ఉత్సవ ప్రత్యేకాధికారి వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దాపురం సీఐ విజయ్‌శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు కల్పించారు. సుమారు వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పిఠాపురం ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ సభ్యులు

పిఠాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పిఠాపురం మండల ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిఠాపురం మండల ఆర్యవైశ్య అధ్యక్షులుగా కేదారి శెట్టి వెంకట సూర్య గంగాధర రామారావు, ఉపాధ్యక్షులుగా మద్దాల బుచ్చిరాజు, కేతవరపు కృష్ణ, మండల కార్యదర్శిగా కొత్త దత్తు, అదనపు కార్యదర్శిగా లక్క రాజా, కోశాధికారిగా కొత్త లక్ష్మినారాయణ, మండల డైరెక్టర్‌గా ఇమ్మడిశెట్టి ప్రసాద్, కంచర్ల బదరీలు నూతన కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఆర్యవైశ్య ప్రముఖులు ఆర్యవైశ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రగల్పాటి కనకరాజు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారాయుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు పల్లకూరి బంగారం, కాసు శ్రీనివాస్, వానరాశి శ్రీనివాస్ గుప్తా, గొల్లపూడి సాయి చలమయ్య, దంగేటి శ్రీ రామకృష్ణ, లక్కి శెట్టి బాబులు, కోసెట్టి సూరిబాబు, కుసుమంచి పాపారావు, కేదార శెట్టి నానాజీ, గొల్లపూడి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

9న పిఠాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు



వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాదులు

పిఠాపురం: స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 9న నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది బత్తిన లక్ష్మణదొర తెలిపారు. ఈ మేరకు బార్ అసోసియేషన సర్వసభ్య సమావేశం తీర్మానించినట్టు చెప్పారు. అసోసియేషన్‌లో పలు పదవులకు ఈనెల 5వ తేదీన నామినేషన్లు స్వీకరిస్తామని ఆయన చెప్పారు. 6న నామినేషన్ల పరిశీలన, 7న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజున పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన చేస్తామన్నారు. 9న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరుగుతుందని, అనంతరం అదే రోజు ఓట్లు లెక్కింపు విజేతల ప్రకటన చేస్తామని లక్ష్మణ దొర చెప్పారు. ఎన్నికల నిర్వహణలో తనతో పాటు రమణారావు, కొత్త సురేష్ సహకరిస్తారని చెప్పారు.

తైక్వాండో వేసవి శిక్షణ ప్రారంభం



వివేకానంద పార్కులో తైక్వాండో వేసవి శిక్షణకు హాజరైన క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): తైక్వాండో వేసవి శిక్షణా శిబిరం ఆదివారం ప్రారంభించారు. స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో రాహుల్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరానికి జిల్లా క్రీడాభివృద్ధిఅధికారి బి.శ్రీనివాస్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. శాప్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జరిగే వేసవి శిక్షణ శిబిరాలకు రూ.7వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో రాణించిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు, రాహుల్ తైక్వాండో క్లబ్ నిర్వాహకులు, కోచ్ సత్యన్నారాయణ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధి నూకరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మనం ధరించే ఆభరణం చిరునవ్వు

బోట్‌క్లబ్: మనం ధరించగలిగే అత్యుత్తమ అభరణం చిరునవ్వు అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న సత్య దంత వైద్యశాల సమావేశ మందిరం ఆదివారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ చిరునవ్వుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవ్వడం ఒక యోగం, నవ్వలేకపోవడం ఒక రోగం అని మన పెద్దలు చెప్పారన్నారు. నవ్వడం వల్ల శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ తగ్గుముఖం పడుతుందని ఈ హార్మోన్ ఎక్కువగా ఒత్తిడి ఉన్న వారిలో ఉంటుందని, నవ్వడం వల్ల ఈ కార్టిసాల్ హార్మోన్ కంట్రోల్ అవుతుందన్నారు. ఇందుకోసం లాఫింగ్ థెరపీ అనే ఒక ప్రత్యేక చికిత్స విధానం కూడా కనిపెట్టారని, తనివితీరా నవ్వుకోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుందన్నారు.

ఘనంగా వేములవాడ భీమకవి విగ్రహ ప్రతిష్ఠ



వేములవాడలో ప్రతిష్ఠించిన వేములవాడ భీమకవి

కరప: వేములవాడలో తుల్యభాగ నదీ తీరాన శివాలయానికి ఎదురుగా నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం వేములవాడ భీమకవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2023లో అప్పటి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.10 లక్షలు మంజూరు చేయగా, గ్రామస్తులు, భక్తులు ఇచ్చిన విరాళాలతో ఆలయాన్ని నిర్మించారు. రావులపాలెం మండలం రావులపాడు గ్రామస్తులు శైవాగమ ప్రతిష్ఠాచార్య బహు సువర్ణసింహతలాట గ్రహీతలు బ్రహ్మశ్రీ పూజ్యం విశ్వనాథశివాచార్య, భైరవభొట్ల మాచరి బ్రహ్మజీశర్మ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి వేములవాడ భీమకవి విగ్రహ ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా 6 వేల మందికి అన్నదానం చేశారు. కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, గ్రామసర్పంచ్ కమిడి మంగాదేవి, కరప డీసీచైర్మన్ పీజీ సత్యనారాయణ, మాజీసర్పంచ్‌లు బండే తాతాజీ, అప్పనపల్లి శ్రీవెంకటనారయ్య, పాలిక సూరిబాబు, మాజీఎంపీపీ కమిడి సీతామహాలక్ష్మి, వివిధ పార్టీల నాయకులు భీమకవిని దర్శించుకున్నారు.

ప్రేక్షకుల గుండెల్లో నిలిచిన దాసరి

బోట్‌క్లబ్: సినీ రంగంలో ఒక శక్తిగా ఎదిగిన దాసరి నారాయణరావు ప్రేక్షకుల గుండెల్లో ఎప్పుడూ చిరస్థాయిగా ఉంటారని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. అఖిలభారత దాసరి యువశక్తి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గోడి వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన జయంతిని నిర్వహించారు. 150 పైగా సినిమాలకు దర్శకత్వం వహించి , 53 చిత్రాలు నిర్మించారన్నారు. ఎన్నో సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారన్నారు. గోడి వెంకట్ మాట్లాడుతూ ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు దాసరి స్కాలర్‌షిప్‌లు ఇచ్చారన్నారు. ఆయన రాజ్యసభ సభ్యులుగా ఉన్న సమయంలో నగరంలో పలు అభివృద్ధి పనులుకు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా 15 మంది కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాలకొండయ్య, పేరూరు సత్యనారాయణ, కోడిగుడ్డు సత్యనారాయణ, గుబ్బల రాంబాబు, కితాడి శ్రీనివాసరావు, నేమాని బాబూరావు, సోమిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

8న మహాలక్ష్మీ అమ్మవారి ఉత్తర నక్షత్ర పూజలు

సామర్లకోట: స్థానిక గోదావరి నదీ తీరంలో ఉన్న అతి పూరాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి ఆలయంలోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఉత్తర నక్షత్రను పురస్కరించుకొని ఈ నెల 8వ తేదీన ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి, ఆలయ పండితులు రవికుమార్ ఆచార్యులు విలేకరులకు తెలిపారు.

నేడు బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

పిఠాపురం: ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు చిత్తూరులో జరగనున్న ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక సోమవారం నిర్వహిస్తున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. రామచంద్రపురం కంతేటి పేర్రాజు పంతులు హైస్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి ఎంపిక ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 1- 1- 2012 సంవత్సరం తరువాత పుట్టిన వారే ఉండాలన్నారు. పాల్గొను క్రీడాకారులు పుట్టిన సర్టిఫికెట్ ఆధార్ కార్డు ఒరిజినల్ తీసుకుని రావాలని ఆయన కోరారు.